

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌తో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ గ్రూప్ ఫొటో

# 12 మందితో కాంగ్రెస్ క్యాబినెట్

మొదటిపేజీ తరువాయి...

తెలుగులో ప్రమాణ స్వీకారం చేయగా ఒక్క దామోదర రాజనర్సింహ మాత్రం ఇంగ్లిషులో ప్రమాణం చేశారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క మనస్సాక్షిగా అంటూ ప్రమాణం చేయగా, మిగిలిన అందరూ దేవుని సాక్షిగా ప్రమాణం స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం రేవంత్‌రెడ్డిని, మంత్రులను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు.

### హాజరైన ప్రముఖులు

ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఆ పార్టీ అభిమానులు తరలివచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం రేవంత్‌రెడ్డి ఆయన సతీమణి గీతతో కలిసి సోనియాగాంధీకి పాదాభివందనం చేశారు. అనంతరం తన కూతురు, అల్లుడిని సోనియా, రాహుల్‌కు పరిచయం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులను రేవంత్‌రెడ్డి హత్తుకొని అభినందించారు.

### సచివాలయానికి రేవంత్

సీఎంగా ప్రమాణం స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి సచివాలయానికి వెళ్లారు. సతీమణి గీతతో కలిసి సచివాలయానికి వెళ్లిన ఆయనకు సీఎస్ శాంతికుమారితోపాటు అధికారులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నేరుగా 6వ అంతస్థులోని సీఎం చాంబర్‌లోకి వెళ్లి సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.

### క్యాబినెట్ తొలి భేటీ

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన రోజునే క్యాబినెట్ తొలి భేటీ జరిగింది. సచివాలయంలో సాయంత్రం 5.25 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సీఎం శాంతికుమారి కొత్త సీఎంతోపాటు మంత్రులకు స్వాగతం పలికారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఆయా శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

### సంక్షేమ, అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దుతా: సీఎం రేవంత్‌రెడ్డి

ఎల్బీ స్టేడియంలో సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం ప్రజలనుద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసగించారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఎంతో బాధ్యతగా, గౌరవంగా ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగిస్తానని తెలిపారు. రాష్ట్రాన్ని సంక్షేమ రాజ్యంగా, అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత తనదని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటానని అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి నాలుగు కోట్ల ప్రజలకు స్వేచ్ఛ ఇవ్వాలని, సామాజిక న్యాయం చేయాలని, ఆసిఫాబాద్ నుంచి అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి కొడంగల్ వరకు సమానంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో సోనియాగాంధీ ఉక్కు సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ సమిధగా మారి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది' అని పేర్కొన్నారు. రైతాంగం, విద్యార్థులు, నిరుద్యోగ యువత, అమరవీరుల కుటుంబాల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇందిరమ్మ రాజ్యం ప్రతినపూనిందని తెలిపారు. తమ ప్రభుత్వ ఏర్పాటుతో తెలంగాణ నలుమూలల సమాన అభివృద్ధి జరుగుతుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో ప్రజలు తమ ఆలోచనను, ఆకాంక్షలను ఎప్పుడైనా పంచుకోవచ్చని చెప్పారు. ఖర్గే, సోనియా, రాహుల్ సూచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. తాము పాలకులం కాదని, సేవకులమని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకునే బాధ్యత తనదని ప్రకటించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్యోతిరావ్‌పూలే ప్రజా భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

### మరో ఆరుగురు ఎవరో?

క్యాబినెట్‌లో సీఎంతోపాటు మొత్తం 18 మందికి అవకాశం ఉంటుంది. గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో సహా 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇంకా 6 మంత్రి స్థానాలు మిగిలి ఉన్నాయి. పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఎప్పుడు ప్రకటిస్తారనే అంశంతో పాటు మిగిలిన ఆరుగురు ఎవరనేదానిపై కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది. ఎవరెవరికి ఈ స్థానాలను కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. పోటీలో ఇంకా చాలా మందే ఉన్నారు. ముఖ్యంగా ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన ఓడిపోయిన సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి, మధుయాష్కీతోపాటు విజయం సాధించిన సుదర్శన్‌రెడ్డి, వివేక్, వినోద్, ఆది శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పోటీలో ఉన్నట్టు సమాచారం.

### ఉప ముఖ్యమంత్రిగా భట్టి

మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో జన్మించారు. పీజీ వరకు చదివారు. 2009, 2014, 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2011-2014 వరకు ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్‌గా, 2011-2014 వరకు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. 2019-2023 వరకు తెలంగాణ కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా వ్యవహరించారు. 2023లో ఎమ్మెల్యేగా గెలిచి, డిప్యూటీ సీఎం పదవి దక్కించుకొన్నారు.

### ఐదోసారి మంత్రిగా తుమ్మల

ఖమ్మం జిల్లాలోని దమ్మపేట మండలం గండుగులపల్లిలో తుమ్మల నాగేశ్వరరావు జన్మించారు. బీకాం చదివారు. ఆయన 1985, 1994, 1999, 2009లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2015లో ఎమ్మెల్సీగా పనిచేశారు. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్ మంత్రివర్గంలో ఆర్‌అండ్‌బీ, మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్, ఎక్సైజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. 2023లో మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి పదవి దక్కించుకొన్నారు.

### మొదటిసారి మంత్రిగా పొంగులేటి

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలం నారాయణపురంలో జన్మించారు. బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 2013లో వైఎస్సార్సీపీలో చేరారు. 2014లో ఖమ్మం ఎంపీగా గెలుపొందారు. 2016లో బీఆర్‌ఎస్‌లో చేరారు. 2023లో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2023లో ఎమ్మెల్యేగా గెలిచి రేవంత్ క్యాబినెట్‌లో మం త్రి పదవి దక్కించుకొన్నారు.

### సంగారెడ్డి జిల్లా నుంచి దామోదర

సిలారపు దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లో జన్మించారు. బీఈ సివిల్ పూర్తిచేశారు. 1999, 2004, 2009, 2023లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో ప్రాథమిక విద్య, మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ మంత్రిగా, ఏపీ డిప్యూటీ సీఎంగా పనిచేశారు. ఇప్పుడు మంత్రి అయ్యారు.

### రెండోసారి మంత్రిగా ఉత్తమ్

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లా తొండ తిరుమలగిరి మండలం తాటిపాములలో జన్మించారు. 1999, 2004లో రెండుసార్లు కోదాడ.. 2009, 2014, 2018, 2023లో నాలుగుసార్లు హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో నల్లగొండ ఎంపీగా విజయం సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో 610 జీవో అమలు చైర్మన్‌గా, గృహ నిర్మాణశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కించుకొన్నారు.

### యువజన నేత నుంచి రెండోసారి అమాత్యుడిగా కోమటిరెడ్డి

నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకుడి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ రాష్ట్ర మంత్రి పదవీ బాధ్యతలను నిర్వర్తించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల బ్రాహ్మణవెల్లంలలో జన్మించారు. తొలిసారి 1999లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 వరకు వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. 2019లో భువనగిరి ఎంపీగా గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ శాఖ మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. 2023 ఎన్నికల్లో విజయం సాధించడంతో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారులో మంత్రిగా ప్రమాణం చేశారు.

### కరీంనగర్ నుంచి మంత్రిగా దుద్దిళ్ల

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తుత భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలో జన్మించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. తండ్రి శ్రీపాదరావును మావోయిస్టులు హత్య చేయడంతో ఆకస్మికంగా రాజకీయాల్లోకి వచ్చారు. 29 ఏండ్ల వయసులో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018, 2023 వరుసగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పౌరసరఫరాలు, శాసనసభా వ్యవహారాల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకొన్నారు.

### మొదటిసారి మంత్రిగా పొన్నం

పొన్నం ప్రభాకర్‌గౌడ్ కరీంనగర్‌లో జన్మించారు. ఎంఏ ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. 2009లో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. 2014 వరకు ఉమ్మడి రాష్ట్ర లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల ఫోరం అధ్యక్షుడిగా, రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా, రసాయనాలు, ఎరువుల స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. తాజాగా హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

### రెండోసారి మంత్రిగా సురేఖ

కొండా సురేఖ వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరిలో జన్మించారు. బీకాం పూర్తి చేశారు. 1995లో గీసుగొండ మండల ప్రజా పరిషత్తు అధ్యక్షురాలిగా రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 1999, 2004, 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ క్యాబినెట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఇప్పుడు వరంగల్ తూర్పు నుంచి ఎన్నికై మంత్రి పదవి పొందారు.

### మావోయిస్టు నుంచి మంత్రిగా సీతక్క

ధనసరి అనసూయ (సీతక్క) ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్నపేటలో జన్మించారు. ఎల్‌ఎల్‌బీ, పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ సాధించారు. 1988లో 10వ తరగతి చదువుతూ జనశక్తి పార్టీలో మావోయిస్టుగా చేరారు. 1997లో జనజీవన స్రవంతిలో కి వచ్చారు. 2009లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2017లో కాంగ్రెస్‌లో చేరారు. 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు మళ్లి గెలిచి మంత్రి పదవి దక్కించుకొన్నారు.

### ఐదోసారి మంత్రిగా జూపల్లి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీనియర్ నేతగా పేరున్న జూపల్లి కృష్ణారావు ఆరుసార్లు ఎమ్మెల్యేగా, వివిధ శాఖలకు మంత్రిగా పనిచేశారు. వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య క్యాబినెట్‌తోపాటు, కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ తరఫున గెలిచి మంత్రి అయ్యారు.


## రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు

- ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహా పలువురు ప్రముఖుల అభినందనలు

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్, నటుడు చిరంజీవి, ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపినవారిలో టీఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ, తెలంగాణ గ్రూప్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిండ్ల చంద్ర శేఖర్‌గౌడ్, హన్మంత్ నాయక్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరాందాస్ యాదగిరి తదితరులు ఉన్నారు.



గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం అనంతరం దివ్యాంగురాలు రజనీకి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, సీఎస్

## రజనీకి కాంట్రాక్ట్ ఉద్యోగం

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నాంపల్లికి చెందిన దివ్యాంగురాలు రజనీకి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (టీఎస్ఎస్‌వోసీఏ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం కల్పించింది. ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణస్వీకారం అనంతరం ఆమెకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రాజెక్టు మేనేజర్‌గా ఉద్యోగం కల్పించింది. నెలకు రూ.50 వేల వేతనం ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## ఇంటెలిజెన్స్ చీఫ్‌గా శివధర్‌రెడ్డి

- సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా శేషాద్రి
- నేడో రేపో వెలువడనున్న ఉత్తర్వులు
- పదవుల కోసం మొదలైన లాబీయింగ్

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం..తనకు విశ్వాసపాత్రులుగా ఉండే అధికారుల బృందాన్ని ఏర్పాటుచేసుకొనే పనిని ప్రారంభించింది. అందులోభాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రిన్సిపల్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి వీ శేషాద్రిని, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఏడీజీ శివధర్‌రెడ్డిని ఎంపికచేసినట్టు తెలిసింది. ఈ మేరకు నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్నాయి. 1994 బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి.. గతంలో నల్లగొండ, నెల్లూరు, గుంటూరులో ఎస్పీగా పనిచేశారు. డిప్యూటీ కమిషనర్‌గా, ఏసీబీ డైరెక్టర్‌గా, డీఐజీ హోదాలో పనిచేశారు. శివధర్‌రెడ్డి ప్రస్తుతం రెల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ అదనపు డీజీగా పనిచేస్తున్నారు. 'ఓటుకు నోటు కేసు'ను సమర్థంగా డీల్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్‌గా శివధర్‌రెడ్డిని నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇంటెలిజెన్స్ విభాగం అధికారుల పని ప్రతిపక్షాలపైనే కాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, అంతర్గత పార్టీ కార్యకలాపాలపై నిఘా ఉంచాలి కాబట్టి.. ఆ పనికి సమర్థుడైన అధికారిని ఎన్నుకున్నారని సమాచారం.

### అందరి దృష్టి.. అధికారుల 'టీం' పైనే

కొత్త ప్రభుత్వంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల కూర్పు ఎలా ఉండబోతున్నదన్న దానిపై ఆసక్తి నెలకొంది. కీలకమైన ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎవరు చేరనున్నారు? జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతోపాటు.. ఆయా శాఖలకు కార్యదర్శులుగా, ముఖ్య కార్యదర్శులుగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా ఎవరికి అవకాశం దక్కుతుందనే చర్చ, ఆసక్తి అన్ని వర్గాల్లోనూ మొదలయ్యింది. ఇప్పటికే పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కీలకమైన పదవుల కోసం తమ ప్రయత్నాలను మొదలు పెట్టినట్టు సమాచారం. కొత్త మంత్రిమండలి కూడా ఏర్పడిన నేపథ్యంలో ఆయా మంత్రివర్గ శాఖలకు ప్రిన్సిపల్ సెక్రటరీలుగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పదవులు పొందేందుకు తమకున్న మార్గాల ద్వారా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. జిల్లాల్లో కలెక్టర్లుగా, ఎస్పీలుగా, పోలీసు కమిషనర్లుగా కొత్త ప్రభుత్వం తమ టీమ్‌లను నియమించే అవకాశం ఉండటంతో.. పలువురు జూనియర్ అధికారులు, తమ సీనియర్ల ద్వారా, తమకు తెలిసినవారి ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలుస్తున్నది.

### సీఎస్, డీజీపీల మార్పుపై చర్చ..

రాష్ట్రంలో పరిపాలన, శాంతిభద్రతలను నడిపించే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ)ని కూడా మార్చే అవకాశం ఉందని అధికారవర్గాలు, ప్రజాప్రతినిధుల్లోనూ చర్చ కొనసాగుతున్నది. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న శాంతికుమారి, డీజీపీగా ఉన్న రవిగుప్తాలను మార్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం గతంలోని సీఎస్, డీజీపీలను కొనసాగనిస్తారా.. అనేది కొంత అనుమానాస్పదమని అధికాకరవర్గాల్లో చర్చ సాగుతున్నది.

